# నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్-నిర్మల్

3 | నిజామాబాద్ సోమవారం 27 మే 2024 | ADILABAD NIRMAL


## సకాలంలో వర్షాలు కురవాలని జలాభిషేకం



గంగాజలం తీసుకొస్తున్న ఖాప్రిగ్రామస్తులు

జైనథ్, మే 26 : వచ్చే వర్షాకాలంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఖాప్రి గ్రామస్తులు ఆదివారం పోచమ్మ, హనుమాన్, శివాలయాల్లోని విగ్రహాలకు గంగనీళ్లతో జలాభిషేకం చేశారు. గంగా నది నుంచి నీళ్లు తీసుకొచ్చారు. మహిళలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.

## ఆటోలో వచ్చి.. దాడి చేసి..

రూ.10 వేలు దొంగిలించిన అగంతకులు



దాడి చేసి డబ్బులు లాక్కుంటున్న అగంతకులు(సీసీ ఫుటేజీ)

ఎదులాపురం, మే 26 : ఆటోలో వచ్చి.. దాడి చేసి నగదు అపహరించుకుపోయిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. బేల మండలంలోని అవాల్‌పూర్‌కు చెందిన మెస్రం కైలాస్ శనివారం సాయంత్రం బస్టాండ్ సమీపంలోని కల్పన బార్‌కు వెళ్లాడు. అతని వద్ద డబ్బులు ఉన్న విషయాన్ని గ్రహించిన అగంతకులు కైలాస్ బార్ నుంచి బయటకు రాగానే అతనిపై దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ.10 వేల నగదును బలవంతంగా తీసుకుని పరారయ్యారు. బాధితుడు కైలాస్ పట్టణంలోని టూ టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరు పాత నేరస్తులు ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

# పర్యాటకంపై పట్టింపేది?



నిలిచిన హరిత రిసార్టు నిర్మాణ పనులు

- అటకెక్కిన టూరిజం కారిడార్ ప్రతిపాదనలు
- నిర్మల్‌లో నిలిచిన హరిత రిసార్ట్ పనులు
- నిధుల కొరతతో ముందుకు సాగని పర్యాటకం

నిర్మల్, మే 26(నమస్తే తెలంగాణ) : అపార ప్రకృతి వనరులు, పురాతన దేవాలయాలు, చారిత్రక కట్టడాలకు నెలవుగా ఉన్న నిర్మల్ జిల్లాను కేసీఆర్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ రూపొందించింది. అప్పటి పర్యాటక శాఖ కమిషనర్ టూరిస్టు ప్రాంతాలను సందర్శించి కారిడార్‌కు ప్రతిపాదనలను తయారు చేయించారు. దాదాపు రూ.50 కోట్లతో మొదట ఈ టూరిజం కారిడార్ పనులను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు రూట్ మ్యాప్‌ను రూపొందించారు. రైల్వే సౌకర్యం ఉన్న బాసర నుంచి కవ్వాల్ అభయారణ్యం, అటు కుంటాల వాటర్ ఫాల్ వరకు ఈ రూట్ మ్యాప్‌ను తయారు చేశారు. నిర్మల్ పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని మూడు వైపులా టూరిజం కారిడార్‌ను అనుసంధానం చేయాలని తలపెట్టారు. ఇందులో భాగంగానే బాసర సరస్వతీ దేవి ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసింది. బాసర సరస్వతీ దేవి ఆలయం నుంచి మొదలుకుని మార్గమధ్యలో గల కదిలి పాపహరేశ్వరాలయం, కాల్వ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంతోపాటు మామ డ మండలంలోని పురాతన బూర్గుపల్లి రాజరాజేశ్వరాలయా న్ని లింకప్ చేశారు. అలాగే నిర్మల్ పట్టణంలోని మల్లన్న గుట్టపై గల హరిహర క్షేత్రంతోపాటు గండిరామన్న సాయిబాబా ఆలయాన్ని కూడా ఈ కారిడార్ పరిధిలోకి చేర్చారు. చారిత్రక దేవాలయాలన్నింటినీ సందర్శించే విధంగా టెంపుల్ కారిడార్‌ను రూపొందించిన అధికారులు.. ఇక సహజ సిద్ధ ప్రకృతి వనరులు, కోటలు, బురుజులను కలుపుతూ ఈ కారిడార్‌ను విస్తరింపజేశారు. నిర్మల్ పట్టణంలోని శ్యాంగఢ్, బత్తీస్‌గఢ్‌లను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకట్టుకోవాలని భావించారు. దీనికోసం ఈ రెండు చోట్ల కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పనులను చేపట్టారు. ముఖ్యంగా శ్యాంగఢ్ వద్ద ఆకర్షణీయమైన లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. కోట లోపలి భాగంలో గ్రీనరీ, ఇతర అభివృద్ధి పనులను కొంతమేర పూర్తి చేశారు. దీంతోపాటు ఈ కోట వద్ద పర్యాటక శాఖ ఓ టూరిస్టు ప్లాజాను కూడా నిర్మించింది. పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో కోటను సందర్శించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపడం లేదు. ఇక్కడి నుంచి ఎస్సారెస్పీ, సోన్ గోదావరి పాత వంతెన, కడెం ప్రాజెక్టులను కూడా ఈ కోటలకు లింకేజీ చేశారు. కడెం ప్రాజెక్టును సందర్శించిన తర్వాత కవ్వాల్ అభయారణ్యాన్ని సందర్శించే విధంగా ఈ టూరిజం కారిడార్‌లో ప్రతిపాదించారు. దీంతోపాటు నిర్మల్ సమీపంలోని కుంటాల, పోచ్చెర వాటర్ ఫాల్‌ను కూడా ఈ టూరిజం కారిడార్ పరిధిలోకి తీసుకొచ్చారు. అయితే ఆయా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించి పనులు ప్రారంభించేందుకు అన్ని రకాల ప్రణాళికలను సిద్ధం చేసింది. దీనికి తోడుగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో హరిత రిసార్ట్‌ను కూడా నిర్మించే ప్రతిపాదనను చేపట్టారు. దాదాపు రూ.10 కోట్లతో ఇక్కడి పాత ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌ను తొలగించి హరిత రిసార్ట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే ఈ నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం రిసార్ట్ పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే గత ఆరు నెలల క్రితం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి బ్రేక్ పడిందంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభు త్వం అమలు చేయ తలపెట్టిన మంచి కార్యక్రమాలన్నింటినీ సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపుతో రద్దు చేస్తుండడంతో జిల్లాలో టూరిజం కారిడార్ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి.



కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన లైటింగ్‌తో వెలిగిపోతున్న శ్యాంగఢ్ కోట(ఫైల్)

# ఉద్యోగం రాలేదని..

## యువకుడి ఆత్మహత్య

- మత్తడి వాగులో దూకి మృత్యు ఒడికి..
- పారామెడికల్ డయాలసిస్ చేసిన యువకుడు
- చదువుకు రూ.లక్షకుపైగా ఖర్చు
- ప్రస్తుతం పెస్టిసైడ్ దుకాణంలో ఉద్యోగం
- మనస్తాపంతో వాట్సాప్ స్టేటస్ పెట్టి మృతి

తాంసి, మే 26 : ప్రభుత్వ ఉద్యోగం రాలేదనే మనస్తాపంలో తొనుపు నిఖిల్(25) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన తొనుపు విశ్వనాథ్-లక్ష్మి దంపతులు తమకున్న ఆరెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి నిఖిల్, నిఖిత కుమారుడు, కూతురు ఉన్నారు. నిఖిత ఆదిలాబాద్‌లో డిగ్రీ చదువుతున్నది. కుమారుడు తొనుపు నిఖిల్ పదో తరగతి వరకు స్థానికంగా చదివాడు. ఇంటర్ ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేసి, యేడాది క్రితం కరీంనగర్ జిల్లాలో పారామెడికల్ డయాలసిస్ కోర్సు చేశాడు. రూ.లక్షకుపైగా ఖర్చు చేశాడు. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం చూశాడు. సంబంధిత నోటిఫికేషన్స్ రాకపోవడంతో ఆరు నెలల క్రితం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ పెస్టిసైడ్ దుకాణంలో రూ.15 వేలకు పనికి కుదిరాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఉద్యోగం రాలేదని మనస్తాపంలో తన ద్విచక్ర వాహనంపై వడ్డాడి మత్తడి వాగు వద్దకు వెళ్లాడు. అనంతరం తన వద్ద ఉన్న సెల్‌లో 'ఇన్ని ఆరాటాలు.. ఇన్ని పోరాటాలు.. ఇన్ని ఆవేశాలు.. ఇన్ని ఆక్రోశాలు.. ఇన్ని ప్రేమలు.. ఇన్ని పగలు.. ఇన్ని అనుబంధాలు.. ఇన్ని అవమానాలు.. ఇన్ని స్వార్థాలు.. ఇన్ని స్నేహాలు.. అన్నింటిని దాటుకుని వస్తే.. చివరికి మిగిలింది ఇదే.. అని శ్మశానంలోని బూడిద ఫొటో'తో తన స్టేటస్ పెట్టాడు. మరో క్లిప్పింగ్‌లో బైపోలర్ డిజార్డర్ అని ఉంది. అనంతరం వాగులో దూకాడు. అటుగా వెళ్తున్న స్థానికులు ద్విచక్ర వాహనాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈత గాళ్ల సహాయంతో గాలించగా నిఖిల్ డెడ్‌బాడి బయటపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అతని తండ్రి విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివరాం తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు కావడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆస్పత్రి ఆవరణ వారి రోదనలతో దద్దరిల్లి పోయింది.



తొనుపు నిఖిల్ (ఫైల్)

# ఆటోవాలా..దివాలా..

- ఆగమైన ఆటోడ్రైవర్ల కుటుంబాలు
- ఆటోలు నడువక.. కిస్తీలు కట్టలేక..
- మహాలక్ష్మి పథకంతో కోలుకోలేని దెబ్బ
- కాంగ్రెస్ సర్కారు ఆదుకోవాలని వేడుకోలు

నిర్మల్ అర్బన్/భైంసా, మే 26 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆటోవాలాల బతుకులు ఆగమాగం అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హస్తం పార్టీ మ్యాని ఫెస్టోలో ప్రకటించిన ప్రకారం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. మహాలక్ష్మి పథకం డిసెంబర్ 9వ తేదీ నుంచి అమలులోకి తెచ్చింది. ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే వారు ఇప్పుడు ఆర్టీసీ బస్సుల వైపే మొగ్గు చూపుతున్నారు. ఆటోలలో అధికంగా మహిళలే ప్రయాణం చేస్తుంటారు. దీంతో ఆటోలలో ప్రయాణించే వారి సంఖ్య తగ్గిపోయింది. రోజు రూ.500 నుంచి రూ.1000 సంపాదించే వారు రూ.300లు కూడా దొరుకడం లేదని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం తమ పొట్ట కొడుతున్నదని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం రాకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. డ్రైవర్లకు యేటా రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ అటకెక్కిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు పాఠశాలలు ప్రారంభమవుతు న్నాయని, పిల్లలకు పుస్తకాలు కొనివ్వలేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారే ఆదుకో వాలని కోరుతున్నారు.



### కిస్తీలు కట్టేందుకు డబ్బు లు లేవు..

మాది లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి. పదిహేనేండ్ల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నా. నాకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గతంలో (మహాలక్ష్మీ పథకం రాకముందు) మా జీవితాలు బాగుండేవి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో మహిళలు ఆటోల వైపు కూడా చూడడం లేదు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో పురుషులు కూడా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. రూ.5 లక్షలతో ఫైనాన్స్‌లో ఆటో కొనుకున్నా. ప్రతినెల రూ.10 వేలు కిస్తీ కడుతున్నా. కిస్తీలు కట్టేందుకు కిరాయిలు కూడా రావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

\- షేక్ ఖదీర్, చామన్‌పెల్లి.



### పూట గడవడం లేదు..

ఆటోలు సరిగ్గా నడవకపోవడంతో డబ్బులు దొరుకడం లేదు. కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. అంతేగాకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించాలి. నెలకు జీవనభృతిగా రూ.12 వేలు ఇవ్వాలి. రూ.5 లక్షల జీవిత బీమా కల్పించాలి.

\- రవి, ఆటోడ్రైవర్



# దశాబ్దాల సమస్యకు పరిష్కారం

- కూరగాయల వ్యాపారులకు అంగడీబజార్‌లో స్థలం కేటాయింపు
- వ్యాపారస్తులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి : చైర్మన్ సత్యం



ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు

ఖానాపూర్/ఖానాపూర్ టౌన్, మే 26 : ఖానాపూర్ పట్టణంలో కొన్ని దశాబ్దాల నుంచి ప్రజలు, వాహనదారులు, పలు శాఖల అధికారులు ఎదుర్కొంటున్న సమస్యకు మున్సిపల్ అధికారులు పరిష్కారం చూపారు. పాత బస్టాండు నుంచి పోలీస్ స్టేషన్ వరకు గల ప్రధాన రహదారిపైనే రోజు కూరగాయలు అమ్ముతారు. ప్రభుత్వ దవాఖాన, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. బుధ, ఆదివారాల్లో వారసంత నిర్వహించడంతో ప్రభుత్వ దవాఖానకు అంబులైన్స్ కూడా రావడానికి ఇక్కట్లు పడాల్సి వచ్చేది. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు అంగాడీబజార్‌లో ఏర్పాటు చేసిన ఖాళీ స్థలంలో తమ అమ్మకాలను కొనసాగించాలని కోరారు. దీంతో వారం రోజులుగా కూరగాయల వ్యాపారులు ఆందోళన చేస్తున్నారు. ఆదివారం మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ సంతోశ్, కమిషనర్ మనోహర్‌లు సందర్శించారు. మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా వ్యాపారులు సహకరించాలని కోరారు. వ్యాపారులు ఆందోళన విరమించడంతో 5, 6వ వార్డు కౌన్సిలర్లు అంగాడీబజార్‌లోకి తరలించారు. వారి వెంట ఎస్ఐ లింబాద్రి, మున్సిపల్ ఆర్ఐ ఫిరోజ్, నాయకులు సురేశ్, అమానుల్లాఖాన్, సంతోశ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు, పోలీసులు

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

తాంసి(తలమడుగు), మే 26 : అకాల వర్షంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం తలమడుగు మండలంలోని పూనగూడ, పల్సి తాండ గ్రామాల్లో ప్రకృతి వైపరీత్యాలతో ధ్వంసమైన ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరు అధైర్య పడొద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం తరపున వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. అనిల్ అన్న యువ సైన్యం సొసైటీ సభ్యులు ఏర్పాటు చేసిన తాడిపత్రులను 30 కుటుంబాలకు తాత్కాలిక నివాసం కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, అభిరాం రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రమాకాంత్ యాదవ్, వెంకటేశ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



తాడిపత్రులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### వామన్‌నగర్‌లో పర్యటన

తాంసి మండలంలోని వామన్‌నగర్ గ్రామంలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకులతో కలిసి పర్యటించారు. నారాయణ బాబా ఆశ్రమాన్ని దర్శించుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వామన్‌నగర్ గ్రామస్తులు సమస్యలు వచ్చినపుడు తనని సంప్రదించాలని సూచించారు. నారాయణ బాబా ఆశ్రమానికి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కృష్ణరత్న ప్రకాశ్, రజినీకాంత్‌రెడ్డి, అండె అశోక్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరమణ, నాగరెడ్డి, లక్ష్మీపతి, రవికాంత్ యాదవ్, అభిరాం రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, ఉత్తం, మహేందర్ పాల్గొన్నారు.

## పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలి

ఎదులాపురం, మే 26 : ఆదిలాబాద్‌లో నకిలీ పత్తి విత్తనాలలో పట్టుబడిన కేసులో అరెస్టు చేసిన వారిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అసలు సూత్రధారులను గుర్తించే విధంగా రిమాండ్‌లో ఉన్న వారిని కస్టడీలోకి తీసుకొని తమదైన శైలిలో విచారణ జరిపి వీరి వెనుక ఉన్నటువంటి ముఖ్య నిందితులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

## రిమ్స్ మూడో అంతస్తు నుంచి దూకిన రోగి

ఎదులాపురం, మే 26 : ఆదిలాబాద్ రిమ్స్ 3వ అంతస్తుపై నుంచి శనివారం అర్ధరాత్రి ఓ రోగి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన చోటు చేసుకుంది. జన్నారంకు చెందిన సాయికుమార్(27) మూడు రోజుల క్రితం కడుపు నొప్పితో రిమ్స్‌లో చేరారు. శనివారం అర్ధరాత్రి దాటాక రిమ్స్ భవనం పైకెక్కి 3వ అంతసు నుంచి దూకాడు. ఈ ప్రమాదంలో అతని కాలు విరుగగా తీవ్ర గాయాలయ్యాయి. వైద్య సిబ్బంది అతడిని రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

## కోతి దాడిలో ముగ్గురికి గాయాలు

భైంసా, మే 26: భైంసాలోని పురాణ బజార్‌లో ఆదివారం కోతి దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. పురాణ బజార్‌కు చెందిన జ్యోతి అనే మహిళతో పాటు మరో ఇద్దరిపై కోతి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గాయపడిన వారిని ప్రభుత్వం ఏరియా దవాఖానకు తరలించారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## గాలివీచినా.. చినుకు రాలినా..

# కరెంటు గోవిందా

- పల్లెల్లో గంటల తరబడి అనధికారిక కోతలు
- విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసినా స్పందన కరువు

తాంసి, మే 26 : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కరెంట్ కోతలతో సామాన్యులు అవస్థలు పడుతున్నారు. పల్లెల్లో గాలి వీచిన, చిరుజల్లులు పడినా కరెంటు తీసేస్తున్నారు. మళ్లీ ఎన్ని గంటలకు వస్తుందో తెలియడం లేదు. నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామంటూనే అధికారులు అనధికారికంగా కోతలు విధిస్తున్నారు. విద్యుత్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తమ సమస్యను యువత సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు. కాగా ఆదివారం మండలంలోని కప్పర్ల గ్రామంలో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి చెట్లు విద్యుత్ తీగలపై తెగి పడ్డాయి. దీంతో విద్యుత్ తీగలు కింద, ఇండ్లపై వేలాడుతున్నాయి. ఒక వైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు కరెంట్ కోతలు వెంటాడుతుండడంతో విద్యుత్‌శాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలమే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వర్షాకాలం పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇబ్బందులు కలుగకుండా చూడాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



కప్పర్ల గ్రామంలో ఈదురుగాలులకు వంగిన సర్వీస్ వైర్లు

# నేలకొరిగిన భారీ వృక్షం



ఈదురుగాలులతో హస్నాపూర్ రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం

తాంసి, మే 26 : హస్నాపూర్, జామిడి, వడ్డాడి పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లా నుంచి నిత్యం వేలాది వాహనాలు వెళ్లే రహదారిపై భారీ వృక్షం నేలకొరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. హస్నాపూర్, ఉండం, సుంకిడి మీదుగా మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో వీచిన భారీ గాలులకు వృక్షం నేలకొరిగింది. ఆ రహదారిపై గంటలపాటు రాకపోకలు సాగలేదు. ఎస్సై శివరాం, సంబంధిత అధికారులతో కలిసి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు.